క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి: ట్రాఫిక్ ఏసీపీ మార్



రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ట్రాఫిక్ సీఐ రామకృష్ణతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు చనిపోతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. కుంకుమ మిల్లు చౌరస్తా, రంగీలా దాబా చౌరస్తా, సీఏఆర్‌హెడ్ క్వార్టర్ చౌరస్తా, సిరిసిల్ల రోడ్డు, రేణుక ఎల్లమ్మ టెంపుల్ చౌరస్తా, పాత బస్టాండ్ అంబేడ్కర్ చౌరస్తాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోనున్నట్లు తెలిపారు. వాహనదారుడు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వినయ్‌సాగర్, ఏఎస్ఐలు ఉమేష్, సదాశివరావు, కానిస్టేబుల్ కొన్నె మహేష్, స్వామి, జగదీశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బాలకవులకు పురస్కారాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీవాణీ సాహిత్య పరిషత్ సిద్దిపేట ఆధ్వర్యంలో 2024 సంవత్సర రాష్ట్ర స్థాయి పెందోట సాహిత్య పురస్కారాలు, బాల సాహిత్య పురస్కారాలను ప్రకటించినట్లు శ్రీవాణీ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కవులు, రచయితలు, బాలకవులను ప్రోత్సహించాలని ఏటా సాహిత్య పురస్కారాలు శ్రీవాణీ సాహిత్య పరిషత్ అందిస్తుందన్నారు. బాల సాహిత్యంలో తొమ్మిది మందికి, సాహిత్యంలో నలుగురికి తెలుగు రాష్ట్రాలలో 2023లో ప్రచురించిన పుస్తకాల ప్రాతిపదికన ఎంపిక చేసినట్లు తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

సిద్దిపేటరూరల్: గ్రామ పంచాయతీల కార్యకలాపాలకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ రాఘవేందర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవి, జీవన్‌రెడ్డి, యాదగిరి, రమాదేవి, సంధ్య, శిల్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడానికి ప్రజల భాగస్వామ్యంతో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ముందుకు వస్తుందని ఆ సంస్థ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు కేడం లింగమూర్తి అన్నారు. గురువారం మాలపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు కోసం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు 25 శాతం వాటా చెల్లిస్తే 75 శాతం నిధులు బాల వికాస సంస్థ ఇస్తుందన్నారు. సమావేశంలో మేనేజరు మధుసూదన్ రెడ్డి, వెన్నరాజు, మాజీ సర్పంచ్ రాజయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శ్రీభూసమేత చెన్నకేశవ స్వామి దేవాలయ పంచమ వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. తన్నీరు శ్రీవాణి, గౌతం దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కల్యాణం జరిగాయి. తోటపల్లి వాస్తవ్యులు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తల్లి లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు పరిరక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలోని హనుమాన్ నగర్ ఎంపీపీఎస్ నిధులు దుర్వినియోగమతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్‌నగర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు ప్రభుత్వ నిధులను పాఠశాల అభివృద్ధికి వినియోగించకుండా, తమ సొంత అవసరాలు వినియోగించారని ఆరోపించారు.

కోత పడకుండా.. భూసారం తగ్గకుండా

వర్షాకాలం పంటల సాగులో దుక్కిదున్నడంలో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. నేల స్వభావాన్ని బట్టి దుక్కిదున్నితే భూమి కోతకు గురికాకుండా, భూసారం తగ్గకుండా ఉంటుందన్నారు. దీంతో మొక్కలకు పోషకాలు లభిస్తాయంటున్నారు. ఆరుతడి పంటల సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి వస్తాయంటున్నారు.

- వర్షాకాలం సాగులో దుక్కి దున్నకమే కీలకం
- రైతులు ఆరుతడి పంటల సాగులో మెలకువలు పాటించాలని సూచన



దుక్కి దున్నుతున్న రైతు

మిరుదొడ్డి(దుబ్బాక): తొలకరి పలకరింపుతో రైతులు సాగు కోసం సమాయత్తం అవుతున్నారు. సాగుకు కావాల్సిన వనరులను సమకూర్చుకుంటున్నారు. అయితే ఏ పంట సాగు చేయాలనుకున్నా దుక్కి దున్నడం కీలకం. కుండపోత వర్షాల వల్ల సాగు భూమి కోతకు గురై నష్టాలు సంభవిస్తుంటాయి. ఏటవాలుగా ఉన్న భూముల్లో సాగు చేస్తున్న పంటలు సైతం వర్షాల వరద తాకిడికి భూసారం కొట్టుకుపోతుంది. దీంతో పంటకు అందాల్సిన పోషకాలు, లవణాలు మొక్కలకు లభించక పోవడంతో దిగుబడి తగ్గిపోతుంది. వర్షాకాలంలో పశువులతో గానీ, ట్రాక్టర్లతో గానీ నేల స్వభావాన్ని బట్టి దుక్కిదున్నాలి. ఆరుతడి పంటలను సాగు చేయడంలో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఈఓ సమ్రీన్ చెబుతున్నారు. వర్షాకాలం సాగుకు అనుకూలమైన నెలల్లో చిన్నచిన్న వరదల తాకిడి నుంచి కాపాడుకోవడానికి దుక్కిని ఎలా దున్నుకోవాలన్న అంశాలపై పలు సూచనలు చేశారు.

ఎర్ర నేలలు

ఎర్ర నేలల్లో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ఈ నేలల్లో వర్షాలు కురిసినప్పుడు పై మట్టి పార కొట్టుకుపోయి అందులో ఉన్న లవణాలు నీటి ద్వారా కొట్టుకుపోతాయి. ఈ నేపథ్యంలో వాలుకు అడ్డంగా పశువులతోగానీ, ట్రాక్టర్‌తో గానీ దుక్కి దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నడం వల్ల నీటి ప్రవాహాన్ని ఆపడంతో పాటు ఎక్కువ నీటిని భూమిలోకి ఇంకే అవకాశాలు ఉన్నాయి. పొలంలో కాలువలు, బోదెలు ఏర్పాటు చేయాలి. పొలంలో అధికంగా నీరు నిలిచినప్పుడు బయటకు నీరు వెళ్లిపోయేలా చర్యలు చేపట్టాలి. ఇటువంటి భూమిలో అంతర సాగు పంటలు చేపట్టే వీలు కలుగుతుంది.

నల్ల రేగడి నేలలు

నల్ల రేగడి నేలల్లో నీటి నిల్వ ఉండే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. ఈ నేలల్లో దున్నడంలో కొత్త ఒరవడి, సాంకేతిక పద్ధతులు అవలంభించాల్సి ఉంటుంది. నల్లరేగడి నేలల్లో 0.8 ఘనపు మీటర్ల టెడ్ గట్లు ఏర్పాటు చేయాలి. గట్ల పైభాగాన 0.1–0.25 శాతం వాలుతో నీరు పొలం నుంచి బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. దీని వల్ల నేల కోతకు గురికాకుండా ఉంటుంది. వెడల్పాటి బోదెలు తయారు చేసి బోదెలపై విత్తనాలు విత్తుకోవాలి. బోదెల పక్కన కాలువలు ఏర్పాటు చేయడం వల్ల తక్కువ వర్షం వచ్చినప్పుడు నీరు ఇంకడానికి అనువుగా ఉంటుంది. ఎక్కువ శాతం వర్షం కురిసినప్పుడు కాలువల ద్వారా నీరు బయటకు వెళ్ళడానికి ఆస్కారం ఉంటుంది. సిద్ధం చేసుకున్న దుక్కిలో ఎంచుకున్న విత్తనాలను విత్తుకోవాలి.



విత్తనాలు వేయడానికి సిద్ధం చేసి పొలం

మట్టి కొట్టుకుపోకుండా..



నీరు నిలవకుండా దుక్కిని దున్నుకోవాలి. నీరు నిలవకుండా కాస్త ఎత్తు కలిగిన కాలువలను ఏర్పాటు చేసుకుంటే మట్టి కొట్టుకు పోకుండా ఉంటుంది. ఎక్కువ శాతం సాగు చేస్తున్న పంటల్లో నీరు నిలవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు నిలువ ఉండే ఆస్కారం ఉన్నప్పుడు కాలువలు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపించాలి.

సమ్రీన్, ఏఈఓ, మిరుదొడ్డి

ఎంపీపీ అవిశ్వాస సమావేశం వాయిదా

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ఎంపీపీపై పెట్టిన అవిశ్వాస సమావేశం మరోసారి వాయిదా పడింది. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగే అవిశ్వాస సమావేశం నేపథ్యంలో కోర్టు స్టే ఇచ్చిన కారణంగా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు సిద్దిపేట ఆర్డీఓ పి.సదానందనం ఎంపీడీఓ కార్యాలయానికి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసాన్ని నెగ్గించుకోవాలన్న పట్టుదలతో ఉన్న ఎనిమిది మంది ఎంపీటీసీలు రహస్యంగా నడిపిన క్యాంపు రాజకీయాలు ఫలించలేదు. దీంతో విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మిరుదొడ్డి, కాసులాబాద్, అందె, ఖాజీపూర్, వీరారెడ్డిపల్లి, ధర్మారం ఎంపీటీసీలు ధర్మారం చిన్నలక్ష్మి, సుతారి నర్సింహులు, కీసరి రాజవ్వ, దండబోయిన లలిత, భాగ్యలక్ష్మి, చాట్లపల్లి బాలమల్లేశం గౌడ్, చెప్యాల శ్రీనివాస్ రహస్య క్యాంపు నుంచి నేరుగా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అవిశ్వాస సమావేశాన్ని వాయిదా వేయడం పట్ల వారు అసహనం వ్యక్తం చేశారు. ఆర్డీఓ జారీ చేసిన ఉత్తర్వు నోటీసు కాపీలను ఎంపీడీఓ గణేష్‌రెడ్డి ఎంపీటీసీలకు అందజేశారు.



ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీలు

గురువారెడ్డి సేవలు చిరస్మరణీయం

సీపీఐ నేత చాడ



నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడవెంకట్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పేదలకు అండగా నిలిచి, అందరి మన్ననలు పొందిన పోరాట యోధుడు ఎడ్ల గురువారెడ్డి అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఎడ్ల గురువారెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా గురువారం సిద్దిపేటలోని గురువారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ప్రాంత అభివృద్ధికి గురువారెడ్డి కృషి వెలకట్టలేనిదన్నారు. సిద్దిపేట నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని సిద్దిపేటకు డిగ్రీ కళాశాలను మంజూరు చేయించారన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వేల్పుల బాలమల్లు కుటుంబాన్ని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అముదాల రంజిత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలను, యూనిఫాం బహిరంగంగా అమ్ముతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు భరత్‌కుమార్, నరేష్, శివ, అనిల్, వసంత్ పాల్గొన్నారు.

దేవాలయ భూములు కాపాడాలి

- నాగపురి, శభాష్ గూడెం గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి, శభాష్ గూడెం గ్రామాల్లోని దేవాలయాల భూములను కాపాడాలని కోరుతూ ఇరు గ్రామాల నాయకులు గురువారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాటాడారు. నాగపురి గ్రామంలో నల్లపోచమ్మ దేవాలయం సర్వే నంబర్ 831లో 22 గుంటలు, శభాష్‌గూడెం గ్రామంలో వీరభద్ర స్వామి దేవాలయానికి సర్వే నంబర్ 705లో 7.30 గుంటల భూములు ఉన్నాయన్నారు. వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, గ్రామ అధ్యక్షుడు రాజపేట జాను, నల్లపోచమ్మ ఆలయ చైర్మన్ గూడెపు మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొమ్మూరికి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

అవకతవకలపై చర్యలేవి?

సిద్దిపేటకమాన్: నంగునూర్ మండలం పాలమాకుల సహకార సంఘంలో 2014లో జరిగిన అవకతవకలపై చర్యలు చేపట్టకపోవడం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరావు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో సహకార సంఘంలో ఓ వ్యక్తి కొంత మంది రైతుల పేరిట అప్పు తీసుకున్నాడనే అప్పట్లో ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ ఆరోపణలపై ఆడిట్ అధికారులు ఇచ్చిన నివేదికలో కూడా అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని రిపోర్టు ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు రికవరీ కాలేదని, రైతుల పేరుపై ఆ అప్పు ఇప్పటికీ అలాగే చూపుతుందన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం చౌటపల్లి సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ రూ.25,016ల విరాళం గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కొత్తకొండ పోశెట్టి, నాయకులు పులికాశి రమేష్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గజ్వేల్‌రూరల్: డీసీఎంలో అక్రమంగా రవాణా చేస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్ ఫోర్స్, గజ్వేల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. చేర్యాల మండలం పెద్దరాజుపేట గ్రామానికి చెందిన నూనె మహేందర్ ఏపీ10 డబ్ల్యూ 0342 నంబర్ గల డీసీఎంలో తరలిస్తున్నాడన్న సమాచారంతో గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్‌లో పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇసుక లారీ పట్టివేత

గజ్వేల్‌రూరల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని సిద్దిపేట టాస్క్ ఫోర్స్, గజ్వేల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ముట్రాజ్‌పల్లి శివారులో రాజీవ్ రహదారి రోడ్డులో టీఎస్19టీ 8298 నంబర్ గల లారీలో ఇల్లకూరి భాస్కర్, సుంచు సతీష్ కలిసి ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినులకు ర్యాంకులు

హుస్నాబాద్: తెలంగాణ లాసెట్ ఫలితాల్లో హుస్నాబాద్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎండీ.రుబినా 517వ ర్యాంక్, హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె. స్రవంతి 1974వ ర్యాంక్ సాధించారు. వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



రుబినా



స్రవంతి

ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: నీటి నిల్వ ప్రదేశాలను గుర్తించి ప్రతీ శుక్రవారం వార్డుల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, చేపట్టే ముందస్తు జాగ్రత్తలపై కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిఖిత, కౌన్సిలర్లు స్వర్ణలత, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై..

మద్దూరు(హుస్నాబాద్): సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. గురువారం మండలంలోని సలాఖపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

కట్కూర్, దుబ్బతండా గ్రామాల్లో..

అక్కన్నపేట(హుస్నాబాద్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ భానోతు జయరాం అన్నారు. అక్కన్నపేట మండలం కట్కూర్, దుబ్బతండా, రామవరం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

విద్యావకాశాలు సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్: ప్రభుత్వం కల్పించే విద్యావకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బెజ్జంకి వరలక్ష్మి, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హెచ్ఎం వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

క్రమశిక్షణతో కూడిన విద్యను..

కోహెడ(హుస్నాబాద్): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంపీటీసీ సభ్యురాలు ఖమ్మం స్వరూప అన్నారు. గురువారం స్థానిక ఎన్‌టీఆర్ కాలనీ, పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్ అందజేశారు. అనంతరం బడిబాట నిర్వహించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



నర్మద (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కుసుంబ కనకవ్వ, మల్లేశం దంపతుల కూతురు నర్మద(28)ను అదే మండలం రామసాగరం గ్రామానికి చెందిన ఘనపురం తిరుపతికి రూ.5.50 లక్షల కట్నకానుకలతో 2013లో వివాహం చేశారు. వీరికి కూతురు మిథాలి, కుమారుడు హిమాన్షులు ఉన్నారు. ఈనెల 10వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్థాపం చెందిన నర్మద క్రిమి సంహారకమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యుత్ సరఫరా బంద్

మర్కూక్(గజ్వేల్): మండలంలోని మర్కూక్, గంగాపూర్, యూసుఫ్‌ఖాన్‌పల్లి, భవానందాపూర్ గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ సుధీర్ తెలిపారు. మర్కూక్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా విద్యుత సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోటిలింగాలలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని కోటిలింగాల 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటిలింగాల ఆలయం ఆవరణ, శాంతి నగర్, రెవెన్యూ కాలనీ, సుభాష్‌నగర్, రూరల్ పోలీస్ స్టేషన్, శ్రీరాంనగర్, మంగలి కాలనీ, శ్రీసాయినగర్, ఎన్‌జీవోస్ కాలనీ, మారుతినగర్, గాంధీ నగర్, ముదిరాజ్‌గడ్డ, సంతోష్‌నగర్, ఇందిరానగర్ కాలనీల పరిసరాల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ ఘనంగా పోచమ్మ బోనాలు

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్‌లో గురువారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామస్తులు బోనాలతో పోచమ్మ ఆలయానికి ఊరేగింపు వెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు.

◆ విద్యార్థులకు నగదు బహుమతి

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్త్‌లో మంచి మార్కులు సాధించారు. గురువారం వారికి గ్రామానికి చెందిన వంటేరు సిద్దారెడ్డి ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి లింగారెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు నగదు బహుమతి అందజేశామన్నారు. పేద విద్యార్థుల చదువు కోసం తమవంతు సహకారం అందిస్తామన్నారు. ధరావత్ గణేశ్‌కు రూ.10 వేలు, బర్మ అభిరామ్‌కు రూ.5 వేలు, ఆరె మంజునాథ్‌కు రూ.5వేలు, బోదాసు అఖిలకు రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మీనాంజనేయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ సులువుగా చదువుకోవడం నేర్చుకోవాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థులు బట్టీ పద్ధతిలో కాకుండా సులువుగా చదవడం నేర్చుకోవాలని ఎంపీటీసీ సుతారి కల్యాణి అన్నారు. మండలంలోని గుండారెడ్డిపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు.

◆ ఏఐఎఫ్‌బీ జిల్లా అధ్యక్షుడిగా సాయికిరణ్

మద్దూరు(హుస్నాబాద్): ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన వెల్ది సాయికిరణ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ అందె బీరయ్య నియామక పత్రం అందజేశారు.

◆ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పథకాలను కొనసాగిస్తుందన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్ల తల్లిదండ్రులకు ఆర్థిక భారం కావద్దనే భావనతోనే రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు.

◆ క్షమాపణ చెప్పాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయన వెంటనే మంత్రికి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మాజీ బ్లాక్ అధ్యక్షుడు, అక్కన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి గురువారం తెలిపారు. మంత్రిని విమర్శించే స్థాయి నైతిక హక్కు హక్కు కౌశిక్‌రెడ్డికి లేదన్నారు.

◆ పత్తి కొనుగోళ్లపై విచారణ జరిపించాలి

హుస్నాబాద్: సీసీఐ ఆధ్వర్యంలో జరిగిన పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి గురువారం డిమాండ్ చేశారు. సీసీఐ అధికారుల అండతో రైతుల బినామీ పేర్లతో పత్తిని మిల్లుల్లో కొనుగోలు చేయించి ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. అలాగే వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై బహిరంగ కొనుగోళ్లు చేస్తూ జీరో బిల్లులతో బినామీ రైతుల పేరిట అమ్మి దోపిడీకి పాల్పడ్డారన్నారు.

◆ వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మురళీకృష్ణ ఆలయ 31వ వార్షికోత్సవం గురువారం ఆలయ నిర్వాహకులు, సుందర సత్సంగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. స్వామి వారికి క్షీరాభిషేకం, జలాభిషేకం, పుష్పాభిషేకం, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు.